# కల్యాణం... కమనీయం...



### కన్నుల పండువగా శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణం
### ఇల్లందకుంటలో పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్
### ముత్యాల తలంబ్రాలు సమర్పించిన జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్

**ప్రజాపక్షం/కరీంనగర్/ఇల్లందకుంట :** అశేష భక్తజనం.. వేద మంత్రాలు తాళాలు తప్పట్ల మధ్య శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. కరీంనగర్ జిల్లా నుంచియే కాక వరంగల్, హనుమకొండతో పాటు ఇతర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరై స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. కరీంనగర్ జిల్లా ఇల్లంద కుంట శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవం శుక్రవారం కన్నుల పండువగా సాగింది. భద్రచలం తర్వాత అతిపెద్ద కల్యాణ మహో త్సవం ఇల్లందకుంటలో జరుగుతుండటంతో జిల్లా నలుమూలల నుండే కాకుండా వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు పూలమాలలు సమర్పించారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం స్వామి వారికి తలంబ్రాలు, పూల మాలలు సమర్పించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య సీతారా మచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో అర్చకులు అంగరంగ వైభవంగా స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ప్రతి ఏటా నిర్వహిస్తున్న కార్యక్ర మంలో భాగంగా కల్యాణ మహోత్సవం వైభవంగా సాగింది. ప్రతిఘట్టం భక్తులను ఆకట్టుకుంది. కల్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగ ణం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశా లతో జిల్లా యంత్రాంగం సమన్వయంతో బ్రహ్మోత్సవాలు ఘనంగా సాగా యి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు అశ్వినీ తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, హుజురాబాద్ ఆర్డీవో రమేష్ బాబు, ఏసిపి మాధవి,దేవస్థానం ఈవో సుధాకర్, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**శ్రీ సీతారాముల ఆశీస్సులు ప్రజలపై ఉండాలి**
**నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**

శ్రీ సీతారాముల ఆశీస్సులు ప్రజలపై ఉండాలని నగర మేయర్ కొలగాని శ్రీని వాస్ అన్నారు. శ్రీ రామ నవమి సందర్భంగా కరీంనగర్‌లో సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సంద ర్భంగా నగరంలో పలు ఆలయాల్లో జరిగిన కల్యాణ వేడుకలకు మేయర్ శ్రీని వాస్, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం హాజరయ్యారు. తీగలగుట్టపల్లిలోని శ్రీ కోదండ రామాలయంలో జరిగిన శ్రీ సీతారాముల కల్యాణ వేడుకలకు మేయర్ శ్రీనివాస్, సిపి గౌస్ ఆలం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మేయర్ కొలగాని శ్రీనివాస్ శ్రీ సీతారాములకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రా లను సమర్పించారు. అనంతరం అర్చకులు వేద మంత్రోచ్ఛారణల శాస్త్రో క్తంగా సీతారాముల కల్యాణంను నిర్వహించారు. సీతారాముల కల్యాణంలో మేయర్ కొలగాని శ్రీనివాస్ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన వితరణ చేశారు.ముఖ్య అతిథిగా హాజరై మేయర్ కొలగాని శ్రీనివాస్‌కు కోదండ రామాలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు.వేద పండితులు వేద మత్రోచ్ఛరణల మధ్య ఆశీర్వచనం అందించారు. మరో వైపు నగరంలోని పలు ప్రాంతాలతో పాటు పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## మార్చి చివరిలోగా పన్నులు చెల్లించాలి

### జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్

**ప్రజాపక్షం/జగిత్యాల :** మార్చి చివరిలోగా యాజమానులు తమ ఆస్తి హక్కుల పన్నులతో పాటు నల్లా బిల్లులు ప్రభుత్వానికి చెల్లించాలని జగి త్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం కలెక్టర్ పర్యటించారు. ఆస్తి పన్ను వసూళ్లను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. అధిక మెత్తంలో బకాయిలు ఉన్న వారిని గుర్తించి రెడ్ నోటీసులు జారీ చేయాలని అదేశాలు జారీ చేశారు. సకాలంలో పన్ను చెల్లించని పక్షంలో ఆస్తుల జప్తుతో పాటు నల్లా కనెక్షన్లు తొలగించాలని పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యరచణ ప్రణాళిక పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ స్పందన, తహసీల్ధార్ రాంమోహన్ తదితరులు ఉన్నారు.

## పెరిగిన ధరలతో సామాన్యునికి భారం

### పెద్దపల్లి ఎంపి వంశీ కృష్ణ



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** కేంద్రం లోని బిజెపి ప్రభుత్వంలో పెరిగిన ధరలు సామాన్యునికి భారంగా మారాయని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం రోజున పార్ల మెంట్ పరిధిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలపై, ఇంధన ధరల పెరుగుదలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గత 10 సంవత్సరాల్లో అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తక్కువగా ఉన్నప్పటికీ, దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉండడం సాధారణ ప్రజలపై భారంగా మారిందని, ప్రత్యేకంగా క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 50–60 డాలర్ల మధ్య ఉన్న సమయంలో కూడా, పెట్రోల్ ధర లీటర్‌కు 100 వరకు పెరగడం అన్యా యమని విమర్శించారు. ఈ కాలంలో ప్రభుత్వం సుమారు 25 నుండి 30 లక్షల కోట్ల వరకు పన్నుల రూపంలో వసూలు చేసిందని, ఆ డబ్బు ఎక్కడ వినియోగించబడిందో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా, ఎల్పీజీ గ్యాస్ కొరతపై వస్తున్న నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. దేశంలో కేవలం ఒక నెలకు సరిపడే గ్యాస్ నిల్వలు మాత్రమే ఉన్నాయనే వార్తలు ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తు న్నాయని తెలిపారు. ప్రభుత్వం ఈ పరిస్థితిని సమర్థవంతంగా ఎదుర్కొని, ప్రజల్లో నమ్మకం కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజలను పానిక్ మోడ్‌లోకి నెట్టే విధంగా పరిస్థితులు మారకూడదని, సరఫరా వ్యవ స్థను బలోపేతం చేసి, ఇంధన ధరలను తగ్గించే దిశగా తక్షణ చర్యలు తీసు కోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ డిమాండ్ చేశారు.

## స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి, ప్రభుత్వ విప్



### భీమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు
### హాజరైన కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్‌పి మహేష్ బి గితే

**ప్రజాపక్షం/వేములవాడ :** దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శ్రీరామ నవమి సందర్భంగా శ్రీ సీతారా ముల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శుక్ర వారం పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. అంతకుముందు మంత్రి ని ఆలయ అతిథి గృహంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీని వాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. శ్రీరామ నవమి సందర్భంగా సీతారా ముల కల్యాణ వేడుకలు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర ఆలయ ఆధ్వ ర్యంలో శివార్చన స్టేజీ వద్ద నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అందజేసేందుకు వచ్చి శ్రీ భీమేశ్వర స్వామి ఆలయానికి చేరుకోగా, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలి కారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ భీమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, శ్రీ సీతారాముల కల్యాణానికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. మంత్రి, ప్రభుత్వ విప్‌కు ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేసి, స్వామివారి తీర్థ ప్రసా దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ శేఖర్, మార్కె ట్ కమిటీ వైస్ చైర్మన్ రాకేష్, ఆర్డీవో రాధాబాయి, ఆలయ ఈఓ రమాదేవి, డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్ జయంత్ కుమార్ పాల్గొన్నారు.

## చరిత్ర కారుడు రమణయ్య మృతి

### మాజీ సిఎం కెసిఆర్ దిగ్భ్రాంతి



**ప్రజాపక్షం/జగిత్యాల :** జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ చరిత్ర కారుడు, విశ్రాంత ఉద్యోగి డాక్టర్ జైశెట్టి రమణయ్య (85) శుక్ర వారం అనారోగ్యంతో మృతి చెందాడు. తెలంగాణ చరిత్ర, పురా తత్వ పరిశోధనలో రమణయ్య విశేశ కృషి చేశారు. రమణయ్య ఉపాధ్యా యుడిగా తెలంగాణ అస్తిత్వాన్ని, సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప పరిశోధకుడిగా పేరు పొందారు. తెలంగాణ ప్రాంత చరిత్ర, పురాతన ఆలయాల శిల్పకళ, స్థానిక వారసత్వంపై రమణయ్య అలుపెరగని కృషి చేశారు. మరుగున పడిపా యిన గ్రామీణ చరిత్రను వెలికితీసి భావితరాలకు ప్రామాణిక ఆధారాలను అందించిన గొప్ప వ్యక్తి రమణయ్య పేరు ప్రఖ్యాతలు సాధించారు. రమ ణయ్య మృతిపై మాజీ సీఎం కేసీఆర్ తన గురువు ఇక లేరని తెలుసుకుని దిగ్భ్రాంతి వ్యక్తం చేసి ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. అలాగే జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, కరీంనగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ రమణ, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి, మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

## ఆంగ్ల సాహిత్యంలో శ్రీకాంత్‌కు పిహెచ్‌డి

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్ :** 'గబ్రీయల్ గార్సియ మారక్వెజ్, సల్మాన్ రషీద్' ఎంపిక చేసిన నవలల్లో అద్భుత వాస్తవికత అనే అంశంపై ఆంగ్ల విభాగ విశ్రాంత ఆచార్యులు రాజగోపాలచార్య పర్యవేక్షణలో శ్రీకాంత్ చేసిన డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ ఆచార్య సురేష్ లాల్, ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ మేఘన రావు, బాహ్య సబ్జెక్ట్ పరీక్షకులు ఆచార్య మనోజ సమక్షంలో మౌఖిక పరీక్షలో సిద్ధాంత గ్రంథాన్ని నిరూపించినందుకు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కట్ట రాజేందర్ డాక్టరేట్ పట్టా ప్రకటించారు. కరీంనగర్ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామంలో జన్మించిన శ్రీకాంత్ ఉస్మానియా విశ్వవిద్యాల యంలో ఆంగ్ల సాహిత్యంలో పిజిని హైదరాబాద్‌లోని ఇఫ్లూ నుంచి పిజిసిటిఇ కోర్సులను పూర్తి చేశారు. అనంతరం కాకతీయ విశ్వవిద్యాలయంలోనే తన పరి శోధనను కొనసాగించి డాక్టరేట్ పట్టాను సాధించారు. తన పరిశోధన కాలంలో ఆయన జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో అనేక పరిశోధనా పత్రాలను ప్రచు రించారు. ప్రస్తుతం ఆయన హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల సహాయ ఆచార్యునిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా కళా శాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్స్ కె.రజినీలత, ఆచార్య డి.రాజశేఖర్, ఐక్యిఏసి సమన్వయకర్త ఎ.శ్రీనాథ్, పరీక్షల నియంత్రణాధికారి డా.శివనాగ శ్రీనివాస్, అసోసియేట్ ఆచార్యులు డా.జె.చిన్న శ్రీకాంత్‌ను అభి నందించారు.

## మున్నూరుకాపులకు ఆలయ చైర్మన్ ఇవ్వాలి

### మంత్రి అడ్లూరికి నాయకులు వినతి



**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో అత్యధిక సంఖ్యలో మున్నూరుకాపు కులస్తులు ఉన్నారని, వీరికి ధర్మపురి దేవస్థానం చైర్మన్‌తోపాటు రాజకీయంగా, నామినేటెడ్ పదవుల్లో తగినన్ని స్థానాలలో అవకాశం కల్పించాలని కోరుతూ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్‌కు మున్నూరుకాపు నాయకులు వినతిపత్రం సమర్పిం చారు. ధర్మపురి పట్టణ మున్నూరుకాపు సంఘం అధ్యక్ష కార్యదర్శులు చీపిరిశెట్టి రాజేష్, బండి మహేష్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం 300 మంది కులస్తులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్‌ను కలిసి ఈమేరకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి ఆలయ పాలకమండలి చైర్మన్ పదవిని కొన్నేళ్లుగా అగ్రవ ర్ణాలకే కేటాయిస్తున్నారని ధర్మపురి పురపాలక సంఘంలో మూడవ వంతు కౌన్సిలర్లు తమ కులస్థులే ఉన్నారని అయినప్పటికీ చైర్మన్, వైస్ చైర్మన్ అవ కాశం లభించలేదని వివరించారు. పట్టణంలో అత్యధిక జనాభా కల్గిన మున్నూరుకాపుల నుండి దేవస్థాన చైర్మన్ పదవి,మార్కెట్ కమిటీ చైర్మన్, మున్సిపాలిటీలో ఎక్స్ ఆఫీషియో సభ్యులుగా నియామకంలో ప్రాధాన్యత కల్పించి అవకాశం ఇవ్వాలని మంత్రిని వినతిపత్రం ద్వారా కోరారు. మున్నూరుకాపులకు తప్పకుండా తగిన ప్రాధాన్యత ఉంటుందని మంత్రి నేతలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు నాయకులు సంగి నర్సయ్య, బండి మురళి, సంగి రాజన్న, సౌళ్ల భీమయ్య, సీపతి సత్యం, గడిపెల్లి సత్యనారాయణ, కాశెట్టి రాంబాబు, స్తంభంకాడి గణేష్, వొజ్జల లక్ష్మ ణ్, చుక్క భీంరాజ్, సోంశెట్టి శేఖర్, ఆశెట్టి శ్రీనివాస్,ఇమ్మడి శ్రీనివాస్, కస్తూరి మురళి ,తదితరులు పాల్గొన్నారు.

## మద్దతు ధరకు మొక్కజొన్న విక్రయం

### చొప్పదండి ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం



**ప్రజాపక్షం/చొప్పదండి :** రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన మొక్క జొన్న పంటను ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.2400లకు చొప్ప దండి వ్యవసాయ మార్కెట్‌లో ప్రభుత్వం కల్పించే మద్దతు ధరపై అమ్ముకో వాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రైతులకు సూచించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మొట్టమొదటి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్యాక్స్ ఆధ్వర్యంలో చొప్పదండి వ్యవసాయ మార్కెట్‌లో స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా ఈ కొను గోలు కేంద్రం నిర్వహించబడుతోందని, రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, వైస్ చైర్మన్ రాజేందర్, మున్సిపల్ చైర్మన్ వద్లూరి సరిత, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సి లర్లు గుర్రం సుజిత్ రెడ్డి, కొట్టె సునీత, గుర్రం రాజేందర్ రెడ్డి, పిట్టల వెంక టేష్, కనుమల్ల రాజశేఖర్, మార్కెట్ డైరెక్టర్లు సాంబమూర్తి, శ్రీనివాస్, కొమురయ్య, స్వామి, రవి, మార్కెట్ కార్యదర్శి రాజేశ్వరి, సొసైటీ కార్య దర్శి కళ్లెం తిరుపతి రెడ్డి, సిబ్బంది తిరుపతి, రమణారెడ్డి, చెంబయ్య, రాజ మౌళి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

## విద్యుత్తు తీగల తొలగింపుతో ఊరట



**ప్రజాపక్షం/ధర్మపురి :** ఇళ్లపై వేలాడుతున్న 11కెవి విద్యుత్తు తీగలతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ క్షణమొక యుగంలా గడు పుతున్న ధర్మపురి పరిసర ప్రాంతాలలోని 110 ఇళ్ల యజమానులకు ఊరట కల్పిస్తూ శుక్రవారం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ విద్యుత్తు వైర్ల తొలగింపు పనులను ప్రారంభించారు. ధర్మపురి కమలాపూర్ రోడ్డులో వేలాడుతున్న సదరు విద్యుత్తు తీగలవల్ల పలువురు విద్యుత్ఘాతంతో మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. ఎన్నోఏళ్లుగా ఉన్న ఈ సమస్యపై సదరు ఇళ్ల యజమానులు మంత్రి లక్ష్మ ణ్ కుమార్‌కు ఇటీవల విన్నవించారు. దీనిపై స్పందించిన మంత్రి వైర్ల మల్లింపు పనులకు ప్రత్యేకంగా రూ.10 లక్షలు కేటా యించి శుక్రవారం కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. దీనితో ఇళ్ల యజమానులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్‌కు కృతజ్ఞ తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎస్ఈ సుదర్శనం, మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి, వైస్ చైర్మన్ ఐ.రామయ్య, ఎఎంసి చైర్ పర్సన్ చిలుముల లావణ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎస్.దినేష్, ఉపాధ్య క్షుడు వేముల రాజేష్,కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా సీతారాముల కల్యాణం



**ప్రజాపక్షం/సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రముఖ ఆలయాల్లో సీతారామచంద్రస్వామి ఆలయాల్లో అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రముఖ ఆలయాలు జై శ్రీరామ్.. శ్రీరామ స్మరణతో ఆలయాలు మార్మోగిపోయాయి. జిల్లాకేం ద్రంలోని ప్రముఖ పురాతన ఆలయం సీతారామచంద్రస్వామి ఆలయంలో కన్నుల పండువగా నిర్వహించారు. సీతారాముల కల్యాణంలో సిద్దిపేటలో జిల్లా కేంద్రంలో అత్యంత వైభవంగా నిర్వహించటం ఆనవాయితీగా వస్తుంది. ఆలయం ప్రాంగణంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఆల యం ముందు కల్యాణమండపాన్ని అత్యంత సుందరంగా ముస్తాబుచే శారు. ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, బంగారు నగలతో ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల సాక్షిగా సీతారాముల కల్యాణం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ దంపతులు కడవేర్గు మంజుల రాజనర్సు దంపతులు పట్టువస్త్రాలు, తలంబ్రాలు అందచేశారు.

**రావిచెట్టు హనుమాన్ ఆలయంలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న కలెక్టర్ హైమావతి**

అలాగే పట్టణంలోని రావిచెట్టు హనుమాన్ ఆలయం, పంచముఖ, గణేశ్ నగర్ ప్రసన్నాంజనేయ ఆలయం, మార్కెట్ దాసంజనేయ ఆలయం, విహె చ్‌పి ఆధ్వర్యంలో వెంకటేశ్వరాలయం, సాయిబాబా ఆలయం, కోటిలింగే శ్వరాలయంలో సీతారాముల కల్యాణం వేదపందుతుల మంత్రోచ్ఛరణల మధ్య సీతారామచంద్రస్వామి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహిం చారు. జిల్లా కలెక్టర్ హైమావతి పట్టణంలో సీతారాముల కల్యాణం సంద ర్భంగా పలు ఆలయాలను సందర్శించి, మొక్కుబదులు చెల్లించుకున్నారు. రావిచెట్టు హనుమాన్ ఆలయంలో కల్యాణోత్సవంలో కలెక్టర్ హైమావతి పాల్గొన్నారు. వేదపండితులు కలెక్టర్‌ను ఆశీర్వదించారు. అలాగే పట్టణం లో సీతారామచంద్రస్వామి కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. పట్టణంలో పలు ఆలయాల్లో సీతారామచంద్రస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. శ్రీరామ నామస్మరణతో ఆలయాలు మార్మో గాయి. భక్తులు హాజరై మొక్కుబడులు చెల్లించుకున్నారు.

## శ్రీకరం .... మనోహరం



కన్నుల పండువగా సీతారాముల కల్యాణం

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** సీతారాముల కల్యాణం జగిత్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. ఉదయం నుంచే భక్తుల ఆలయాలను సందర్శించి స్వామివారని దర్శించుకున్నారు. కల్యాణాన్ని తిల కించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతో ఆలయాలు జనంతో పోటెత్తాయి. ఆలయాల్లో అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపు కోదండ రామాలయం, విద్యానగర్‌లోని ఎడ్ల అంగడి రామాలయం, అంగడి బజార్ ఉన్న మార్కండేయ దేవాలయం, బంజరు దొడ్డి ఆంజనేయ స్వామి, అష్ట లక్ష్మి , బ్రాహ్మణ వాడలోని శ్రీరామ మందిరం, హరిహర ఆలయం, అరవింద్ నగర్ లోని అభయాంజనేయ, పోచమ్మ వాడలోని ఆంజనేయ స్వామి, గోవిందుపల్లి, టవర్ సర్కిల్‌లో ఉన్న శివాలయాలు, ఉప్పరిపేట దాసాంజనేయ ఆలయాలతో పాటు 50 వార్డుల్లో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జగి త్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, అదనపు కలెక్టర్లు లత, రాజ గౌడ్, ఎస్పీ అశోక్ కుమార్, డీఎస్పీ రఘు చందర్, కరీంనగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ రమణ, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, మున్సి పల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్లు అడువాల జ్యోతి, తాటిపర్తి విజయ లక్ష్మి, బోగ శ్రావణి తదితరులు వివిధ ఆలయాల్లో కల్యాణ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ ఆల యాల్లో పల్లకి సేవలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ వితరణ చేశారు. ఈ కార్యక్రమాల్లో కౌన్సి లర్లు, ఆలయ కమిటీల నిర్వాహకులు, భక్తులు ఉన్నారు.

## వేడుకల్లో ఉచిత మజ్జిగ, చలివేంద్రం కేంద్రాలు ప్రారంభం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** వ్యాల్ల హరీష్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని శ్రీ సీతారామ కల్యాణం మహోత్సవా నికి విచ్చేస్తున్న ప్రజలు భక్తులు మహిళలకు దాహార్తి తీర్చాలనే సంకల్పంతో రామగుండం నియోజకవర్గంలోని ప్రధాన ఆలయాల వద్ద జరిగే కల్యాణో త్సవ వేడుకలలో ఉచిత మజ్జిగ, చలివేంద్ర కేంద్రాలు ప్రారంభించామని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎనిమిదవ కాలనీ, గోదావరిఖని కోదండ రామాలయం, గంగానగర్ చంద్రశేఖర్ నగర్‌లో అన్న ప్రసాదంతో పాటు గోదావరిఖని బస్టాండ్ సమీ పంలోని ఐబి కాలనీ అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద భక్తుల సౌక ర్యార్థం కల్యాణోత్సవానికి వచ్చే ప్రజలకి ఉచిత, మజ్జిగ పంపిణీ చేశామని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీతారామచంద్ర కల్యాణ మహో త్సవం రామచంద్రుడి పట్టాభిషేకం భక్తులు ఆశీర్వచనం పొందేందుకు పెద్ద సంఖ్యలో వస్తారని వారి సౌకర్యార్థమే వ్యాల్ల హరీష్ రెడ్డి ఫౌండేషన్ ద్వారా ఉచిత మజ్జిగ పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో గంగాజమున తహజీబ్ ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొనడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమాలలో రామగుండం కార్పొరేషన్ మాజీ కో అప్షన్ మెంబర్ తస్నింబాను జాహిద్ పాషా, అక్బర్, అబ్దుల్ కదీర్, తహసీన్, మొయిన్ రాజ్ మొహమ్మద్, పొలాడి శ్రీనివాస్ రావు, బూరుగు వంశీ క్రిష్ణ, మేకల రామస్వామి, బొట్ల పోషం, కడమండ్ల శ్రీహరి, చొప్పరి శ్రీనివాస్, కొండా సురేష్, బొబ్బిలి సతీష్, కడార్ల శ్రీధర్, బండి రాజు, మహమ్మద్ షఫీ, అక్బర్, మోయిన్ పాషా, సిగిరి రాము, దాడి తిరుమల్, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి మండ లంలో శుక్రవారం శ్రీరామనవమి పర్వదిన వేడుకలు అంగ రంగ వైభవంగా జరిగాయి. ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయ ఆవరణలోని శేషప్ప కళావేదికపై స్వామి వారి నిత్య కళ్యాణంతోపాటు శ్రీ సీతారాముల కళ్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు.అదేవిధంగా పట్టణం లోని శ్రీ లక్ష్మీ నృసింహ కాలనీలోని శ్రీరామాలయ ఆవర ణలో, దొంతాపూర్ గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో, తీగల ధర్మారం శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో, నక్కలపేట గ్రామంలో సీతారాముల కల్యాణం అశేష భక్తజనుల సమక్షంలో కన్నువపండువలా జరిగాయి. శ్రీరామనవమిని పురస్కరించుకుని ధర్మపురి పట్టణంలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో కులస్తులు భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. కాగా శ్రీ సీతారాముల కల్యాణ వేడుకల్లో ముఖ్య అతిథిగా సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ పాల్గొన్నారు.



## అడవి కుక్కల దాడిలో జింక మృతి



**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** మండలంలోని చిలపెల్లి అటవీ ప్రాంతంలో గురువారం అడవి కుక్కల దాడిలో గాయపడిన జింక మృతి చెందింది. అడవి కుక్కల బారి నుంచి తప్పించుకునే క్రమంలో జింక తీవ్రంగా గాయపడగా, బీట్ ఆఫీసర్ సంతోష్, సిబ్బంది కలిసి ఫారెస్ట్ వాహనంలో దానిని పశువుల ఆసుపత్రికి తరలించారు. అక్కడ వెటర్నరీ వైద్యులు అత్యవసర చికిత్స అందించారు. వైద్యం అనంతరం కోలుకుంటుందని భావించిన అధికారులు జింకను అడవిలో వదిలేందుకు తీసుకువెళ్లగా, మార్గమధ్యలోనే ప్రాణాలు విడిచిందని ఇన్చార్జి ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ ఘటనపై విచారణ జరిపి అడవి ప్రాణుల రక్షణకు, పర్యవేక్షణకు మరిన్ని కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రవీణ్ కుమార్, బీట్ ఆఫీసర్ సంతోష్, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోకి ఇద్దరు కార్పొరేటర్లు



**ప్రజాపక్షం / మంచిర్యాల :** మంచిర్యాల నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై బిజెపికి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్ కార్పొరేటర్ తోటపెల్లి రాజేశ్వరి, 6వ డివిజన్ కార్పొరేటర్ వనపర్తి కేత రాజేష్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో బిజెపికి ఫ్లోర్ లీడర్ లేకుండా చేయడమే లక్ష్యంగా రాజకీయ పావులు కదులుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బిజెపి ఫ్లోర్ లీడర్ ముకేష్ గౌడ్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ వలసలు కొనసాగుతున్నాయనే చర్చ నడుస్తోంది.మున్సిపల్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, మహిళా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా కల్యాణ మహోత్సవ వేదిక

### మహేష్‌కు మార్‌గౌడ్, కవిత, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లా కేంద్రంలోని రఘునాథ ఆలయంలో జరిగిన సీతారాముల కళ్యాణోత్సవం రాజకీయ ప్రముఖులకు వేదికగా మారింది. విమర్శలు ప్రతి విమర్శలతో నిత్యం బిజీగా ఉండే ప్రముఖ నేతలు ఒకే వేదికపై కళ్యాణ మహోత్సవంలో పాల్గొనడం దేవుని దగ్గర అంత ఒకటేనని రుజువు చేసింది. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ దంపతులు, తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత దంపతులు, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ శ్రీవారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కళ్యాణ మహోత్సవంలో ప్రముఖ రాజకీయ నేతలు శ్రీవారి సేవలో తరించటం మూడు పార్టీలకు సంబంధించిన నాయకులు పాల్గొనడం భక్తులను ఆశ్చర్యానికి గురి చేసింది. ఇదిలా ఉండగా కల్వకుంట్ల కవిత శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం సాయంత్రం కొత్త పార్టీ పేరు ప్రకటించడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. అంతకుముందు ఒకే వేదికపై అధికార పార్టీ నేతతో పాటు కొత్త పార్టీ ప్రకటించుకున్న కల్వకుంట్ల కవిత శ్రీరామనవమి సందర్భంగా ముగ్గురు కలవడం ప్రత్యేక చర్చకు దారి తీసింది.

## సంగారెడ్డి వరకూ మెట్రో విస్తరణకు డిమాండ్

### స్థానిక ఎమ్మెల్యే చింతాప్రభాకర్




**ప్రజాపక్షం/సంగారెడ్డి :** రాష్ట్ర అసెంబ్లిలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతాప్రబాకర్ ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ కీలక అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు. మియాపూర్ నుంచి ఇస్నాపూర్ వరకు మెట్రో రైలును పొడిగిస్తామని ముఖ్యమంత్రి గతంలో చేసిన ప్రకటనను గుర్తు చేస్తూ పెరుగుతున్న జనాబా అవసరాలను దృష్టిలో ఉంచుకొని సంగారెడ్డి జిల్లా కేంద్రం వరకు మెట్రో సేవలను విస్తరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంగా ఉండటంతో నారాయణఖేడ్, జహీరాబాద్ ,అందోల్ ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున ఇక్కడ నివసిస్తూ హైదరాబాద్‌కు రోజువారీ రాకపోకలు సాగిస్తున్నారని పేర్కొన్నారు. సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడంతో వారు. తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో మెట్రో రైలు విస్తరణ చేపడితే ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని అన్నారు. అదే విధంగా మదీనా గూడ నుంచి సంగారెడ్డి చౌరస్తా వరకు జరుగుతున్న రహదారి పనులు నత్తనడకన సాగుతున్నాయని అసెంబ్లీలో ప్రస్తావించారు. 2026 నాటికి పూర్తి కావాల్సిన ఈ ప్రాజెక్టు ఆలస్యమవుతుండటంతో ప్రయాణికులు ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పనులను పూర్తి చేసి ప్రజలకు ఉపశమనం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## రాముడి ఆశీస్సులు ప్రజలపై మెండుగా ఉండాలి

### సీతారాముల కల్యాణానికి హాజరైన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/పెద్ద శంకరంపేట:** శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీ సీతారాముల ఆలయం ఆవరణలో సీతారాముల కళ్యాణ మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ మహోత్సవానికి నారాయణఖేడ్ ఎమ్మెల్యే అనుపమ సంజీవరెడ్డి దంపతులు సీతారాముల స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలను స్వీకరించారు. మండల కేంద్రంలోని ప్రతి సంవత్సరం జరిగే ఎదురుకోలు కు భిన్నంగా హర్షాతిరేకం అనుగుణంగా వస్తున్నట్టే ఈ సంవత్సరం కూడా మేళ తాళాలు, భజనలు, వేద, మంత్రాలు, జయధ్వానాల మధ్య శ్రీరాముడు, లక్ష్మణమూర్తి ఉన్న మంటపానికి చేరుకున్నారు. కరతాళ ధ్వనులు, తాంబూలాలు ఇచ్చిపుచ్చుకోవడం చైత్ర శుద్ధ నవమి రోజు ప్రతిష్ట జరుపుకొని నూతన ఆలయం లో అత్యంత వైభవంగా శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం కనువిందుగా జరిగింది. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ముఖ్య నాయకులు సర్పంచులు ప్రజాప్రతినిధులు గ్రామ ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అడవుల వినాశనం.. గిరిజనుల ఆక్రందన

### అభివృద్ధి పేరిట అడవుల నరికివేత
### ఓపెన్ కాస్టు గనుల విస్తరణతో..
### అనాథలవుతున్న ఆదివాసీలు



**ప్రజాపక్షం / తిర్యాణి/మంచిర్యాల :** తిర్యాని మండలంలో అభివృద్ధి ముసుగులో జరుగుతున్న ఓపెన్ కాస్ట్ బొగ్గు గనుల విస్తరణ గిరిజనుల పాలిట శాపంగా మారింది. డోర్లీ, కైరిగూడ వంటి ప్రాంతాల్లో గనుల తవ్వకాల కోసం వేలాది హెక్టార్ల అడవిని నిర్దాక్షిణ్యంగా నరికివేయడంతో పర్యావరణ సమతుల్యత పూర్తిగా దెబ్బతింటోంది. తరతరాలు గా ప్రకృతి ఒడిలో స్వేచ్ఛగా జీవిస్తూ, అటవీ ఉత్పత్తులపై ఆధారపడి స్వావలంబన పొందుతున్న గిరిజన కు టుంబాలను బలవంతంగా భూ ముల నుంచి దూరం చే య డం వారి ఉనికిని ప్రమాదంలోకి నెట్టేస్తోంది. తవ్వకాల వల్ల కాలుష్యంతో అడవి మాయమవ్వడమే కాకుండా, పల్లెలు రోగాల నిలయాలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### జీవనాధారానికి ముప్పు

గిరిజనులు అడవుల్లో పంటలు పండిస్తూ, ఔషధ మొక్కలు సేకరిస్తూ జీవించేవారు. ఇప్పుడు ఓపెన్ కాస్ట్ గనుల కోసం భూములను స్వాధీనం చేసుకుని, నామమాత్రపు పరిహారం ఇచ్చి వారిని వలస వెళ్లేలా చేస్తున్నారు. వలస వెళ్లిన చోట స్థిరమైన ఉపాధి లేక, గూడు దొరకక వారి జీవితాలు ఛిన్నాభిన్నమవుతున్నాయి. చెట్ల నరికివేత వల్ల వర్షపాతం తగ్గిపోవడం, వన్యప్రాణులు ఊళ్లపైకి రా వ డం వంటి దుష్పరిణామాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

### ఆరోగ్య సంక్షోభం – నీటి కరువు

గనుల తవ్వకాల వల్ల గాలి కాలుష్యం విపరీతంగా పెరిగి గ్రా మాల్లో శ్వాసకోశ వ్యాధులు, చర్మ సమస్యలు ప్రబలుతున్నాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. మరోవైపు భూగర్భ జలాలు అట్టడుగుకు పడిపోవడంతో బోర్లు ఎండిపోయి,



చెరువులు క్షీణించి తాగునీటి కోసం గిరిజన మహిళలు కిలోమీటర్ల కొద్దీ నడవాల్సి వస్తోంది.

### యథేచ్ఛగా చట్టాల ఉల్లంఘన

అడవుల హక్కుల చట్టం ప్రకారం గిరిజనుల అనుమతి తప్పనిసరి అయినప్పటికీ, భూముల స్వాధీనంలో పారదర్శకత లోపించిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకవైపు పులుల సంరక్షణ కోసం టైగర్ జోన్ ఏర్పాటు చేస్తున్నామని చెబుతూనే, అదే ప్రాంతాల్లో గనుల సర్వేలు నిర్వహించడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని ఎండగడుతోంది. ప్రకృతిని కాపాడుకుంటూ,హక్కులకు భంగం కలగకుండా చేసేదే నిజమైన అభివృద్ధి అని పర్యావరణ కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.

## సాగునీటి కోసం సాగర్ నీటి విడుదల



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ ప్రాజెక్టు నుండి నిజాంసాగర్ ఆయకట్టు పరిధిలో రైతులు సాగు చేస్తున్న వరి పంట అవసరం నిమిత్తం 5వ విడత నీటిని శుక్రవారం విడుదల చేసినట్లు ప్రాజెక్టు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. 1200 క్యూసెక్కుల నీటిని మధ్యాహ్నం 3 గం.లకు విడుదల చేశారు. నిజాంసాగర్ కాలువ పరిసర ప్రాంతాలు, గ్రామాల ప్రజలు, రైతులు ఏ సందర్భంలో అయినను ప్రాజెక్టులోకి దిగరాదని,భద్రత దృష్ట్యా ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## వైద్యుడిపై దాడి ఘటనలో నిందితులపై చర్యలు

### కలెక్టర్ అభిలాష అభినవ్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యునిపై గురువారం చోటుచేసుకున్న దాడి ఘటనను జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్ తీవ్రంగా ఖండించారు.ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు.శుక్రవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేస్తూ,ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడానికి వీల్లేదని హెచ్చరించారు.అరాచకానికి పాల్పడే వారిపై నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తామని తెలిపారు.ఈ ఘటనపై ఇప్పటికే పూర్తి స్థాయి విచారణ కొనసాగుతోందని,బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ ఘటన నేపథ్యంలో జిల్లాలో వైద్య సేవలకు ఎటువంటి అంతరాయం కలగలేదని కలెక్టర్ తెలిపారు.జిల్లాలోని అన్ని ప్రభుత్వ,ప్రైవేటు అసుపత్రులు యథావిధిగా పనిచేస్తున్నాయని,ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.సాధారణ ఓపీ సేవలతో పాటు అత్యవసర వైద్య సేవలు కూడా నిరంతరాయంగా కొనసాగుతున్నాయని వివరించారు.ప్రజారోగ్యానికి భంగం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకు



న్నామని,వైద్యులకు రక్షణ కల్పించడంతో పాటు శాంతిభద్రల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు.

# ఘనంగా సీతారాముల కళ్యాణోత్సవం



**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలోని శ్రీ రామ మఠంలో, పోచారం, జైతాపూర్, ఎఆర్పీ క్యాంప్ గ్రామాల్లోని రామాలయాలతో పాటు సారంగపూర్ ఎన్సీఎస్సెఫ్ షుగర్ ఫ్యాక్టరీ వద్ద గల శ్రీ కోదండ రామాలయంలో శ్రీ రామ నవమి ఉత్సవాలను అంగరంగవైభవంగా నిర్వహించారు. శ్రీ సీతా రాముల కళ్యాణ మహోత్సవానికి అవసరమైన పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పెద్దలు సమర్పించుకున్నారు. అర్చకుల వేద మంత్రోచ్ఛరణలు మంగళ వాయిద్యాల నడుమ శ్రీ సీతారాముల కళ్యాణాన్ని కన్నుల పండువగా జరిపారు. అఖిలాండ కోటి బ్రహ్మండనాయకుడైన శ్రీరామునికి, సకల సుగుణాల రాశి అయిన సీతమ్మకు అభిజిత్ లగ్నంలో జరిగిన జగత్ కళ్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణాలు మొత్తం శ్రీ రామ నామస్మరణతో మార్మోగిపోయాయి. ఆలయ అర్చకులు ఉత్సవ విశిష్టతను, వధూవరుల వంశాల విశిష్టతను వివరిస్తూ శ్రీ సీతారాముల ఔన్నత్యాన్ని చాటి చెప్పారు. చల్లని సీతమ్మకు చక్కని రామయ్యకు చూడ చక్కని జోడి అని సుభాషించారు. వీరి జంట కన్నులకు పంట అని కొనియాడారు.పలు గ్రామాల పెద్దలు సీతమ్మ వారి తరపున ఒక బృందం, రామయ్య తరపున మహోత్సవ వైభవాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. స్వామి వారి కళ్యాణం అ నంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏ ర్పాటు చేశారు. గ్రామాభివృద్ధి కమి టీ సభ్యులు, ఆయా గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

## బిసి హక్కుల పరిరక్షణే ధ్యేయం

### బిసి జెఎసి చైర్మన్ సిద్ధి రమేష్ యాదవ్




**ప్రజాపక్షం / చెన్నూరు :** రాష్ట్రంలో ఇతర కులాలకు చెందిన వారు అక్రమంగా బిసి సర్టిఫికెట్లు పొందడంతో బిసిలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని బిసి జెఎసి చైర్మన్ సిద్ధి రమేష్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్ లోని రాష్ట్ర కార్యాలయంలో బిసి ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షులు, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి చిరంజీవులుతో బిసి జెఎసి నాయకులు సమావేశమై చర్చించారు. మార్వాడీలు అక్రమంగా బిసి సర్టిఫికెట్లు పొందుతూ రాష్ట్రంలోని బిసి సామాజిక వర్గాల హక్కులను హరిస్తున్నారని మండిపడ్డారు. బిసిల హక్కులను కాపాడటమే తమ ప్రధాన ధ్యేయమని, అక్రమ సర్టిఫికెట్ల వల్ల విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అసలైన బిసిలకు తీరని అన్యాయం జరుగుతోందని తెలిపారు. ఇతర కులాల వారు సర్టిఫికెట్లు పొందడం వల్ల సామాజిక న్యాయం దెబ్బతింటోందని, దీనిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక విచారణ కమిటీలు వేసి నకిలీ సర్టిఫికెట్లను రద్దు చేయాలని సూచించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని, త్వరలోనే అక్రమ సర్టిఫికెట్లపై ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పిస్తామని వివరించారు. బిసి జెఎసి నాయకుడు సాధనబోయిన కృష్ణ పాల్గొన్నారు.

## బాధితులకు అండగా.. సర్పంచ్ బన్సీరాథోడ్

### నివాస పూరిగుడిసె దగ్ధమై నిరాశ్రయులైన కుటుంబం

**ప్రజాపక్షం/రామాయంపేట:** నివాస పూరిగుడిసెకు నిప్పంటుకొని పూర్తిగా దగ్ధమైన ఘటనలో నిరాశ్రయులైన బాధిత కుటుంబానికి గ్రామ సర్పంచ్ అండగా నిలిచారు. మండలంలోని జమ్లా తండాకు చెందిన వాంక్డోత్ రజిత దేవిసింగ్‌లు తమ పూరిగుడిసెలో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో నిత్యవసర వస్తువులతో పాటు పూరిగుడిసె మంటల్లో కాలిపోయింది. విషయం తెలుసుకున్న సర్పంచు బన్సీరాథోడ్ శుక్రవారం బాధిత కుటుంబానికి అండగా నిలిచి తనవంతు సహాయంగా ఐదువేల రూపాయల ఆర్థిక సహాయంతో పాటు 50 కిలోల బియ్యాన్ని అందజేసి తక్షణ ఉపశమనాన్ని కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో గ్రామస్థులు ఒక్కటిగా నిలబడి సహాయం చేయడం ఎంతో అవసరమని తెలిపారు. ఈకార్యక్రమంలో దంతెపల్లి సర్పంచు మస్కూరి బాల్‌రాజు, కంలియా నాయక్, పాండు, ముత్యాలిబాయి, బిక్షపతి, రమేష్, మదన్, జగన్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## బడ్జెట్ ముమ్మాటికీ ప్రజలను మోసగించడానికే

### బిజెపి జిల్లా అధ్యక్షుడు
### నగునూరి వెంకటేశ్వర్ గౌడ్

**ప్రజాపక్షం / మంచిర్యాల :** ఇటీవల ఎన్నికల అనంతరం గెలిచిన ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు సేకరించకుండా అన్యాయంగా ప్రవేశపెట్టిన బడ్జెట్ ను బిజెపి జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఖండించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నూతనంగా విలీనమైన గ్రామాల్లో అభివృద్ధిపై స్పష్టమైన ఆలోచన లేకుండా కేవలం స్వలాభం కోసమే ఈ బడ్జెట్ రూపొందించారని విమర్శించారు. ఓటు వేసి గెలిపించిన ప్రజలను మోసం చేసేలా ఉన్న ఈ విధానం సరైనది కాదని మండిపడ్డారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు వర్క్ ఆర్డర్, ఎస్టిమేషన్ లేకుండా అభివృద్ధి పేరుతో రోడ్డు పక్కన ఉన్న



వ్యాపార స్థలాలను కూల్చివేయడం హీనమైన చర్య అని ధ్వజమెత్తారు. ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే అక్రమ కేసులు, బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బిజెపి గెలిచిన ప్రాంతాల్లో అభివృద్ధిపై ఆంక్షలు విధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇలాంటి చర్యలు మానుకోకపోతే జిల్లావ్యాప్తంగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎనగందుల కృష్ణమూర్తి, దుర్గం అశోక్, నాయకులు వెంకటేశ్వరరావు, శ్రీదేవి, కమలాకర్ రావు, పొన్నవేణి సదానందం, నాంపల్లి శ్రీనివాస్, తుమ్మేటి సరిత, గుర్రాల లావణ్య పాల్గొన్నారు.

# కమనీయంగా సీతారామచంద్రుల కల్యాణం

### పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే
### జిల్లాలో రామ నామస్మరణ వేడుకలు

**ప్రజాపక్షం/మెదక్ :** వేళతాళాల చప్పుళ్ల ఎదుర్కోళ్లు, పూజారుల వేద మంత్రాలు భక్తుల జయ జయధ్యానాల నడుమ శుక్రవారం శ్రీ సీతారాముల కల్యాణం కన్నుల పండుగగా జరిగింది. మెదక్ జిల్లా వ్యాప్తంగా ఉదయం నుంచి అన్ని ఆలయాల వద్ద భక్తులు బారులు తీరగా సరిగ్గా మధ్యాహ్నం 12 గంటలకు కల్యాణం నిర్వహించారు. ఉత్సవాలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.మెదక్ లోని శ్రీ కోదండ రామాలయంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, మున్సిపల్ చైర్మన్ రాధిక రాజు,వైస్ చైర్మన్ నరేష్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కౌన్సిలర్లలతో కలిసి దేవతా మూర్తులకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లిఖర్జున్ గౌడ్, సీనియర్ నాయకులు తిరుపతి రెడ్డి, జీవన్ రావు, జిల్లా ఎస్పీడీవీ శ్రీనివాస రావు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్లకీ సేవలో అమ్మవారిని, స్వామివారిని ఊరేగించారు. సుముహూర్తం ప్రారంభం కాగానే ఆలయ అర్చకులు నారాయ ణ చార్యులు, నర్సింహా చర్యులు, వెం కట చార్యులు, వేద పండితులు వైద్యశ్రీనివాస్ శర్మ, కృష్ణా రావు, శ్రీవాండ్ల కృష్ణమూర్తి, ప్రసాద్ రాయి కోటి పండిత్ రావు, శ్రీవాండ్ల సాయిబాబా, లక్ష్మ ణరావు, శ్రీనివాస్ చారి మంత్రోచ్చారణల నడుమ సీతారాముల కల్యాణం నయనానందకరంగా సా గింది. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లు కలగకుండా ఆలయ కమీటి అధ్యక్షులు బండ నరేందర్ తదితరులు ఏర్పాట్లు చేశారు. పట్టణ సీఐ మహేష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. కౌన్సిలర్లు గంగామణి, హరిత, లక్ష్మీ , వెం కటరమణ, ఆంజనేయులు, శివరామ కృష్ణ, రాజశేఖర్, ఆలయ కమటీ సభ్యులు యాచం బాల్ రాజ్ నగరం మల్లేశం నందిని శ్రీనివాస్, పురుషోత్తం, సకిలం శ్రీనివాస్, బద్రినాథ్, గోపాలకృష్ణ, మాజీ కౌన్సిలర్లు వివిధ పార్టీ నేతలు, పెద్ద ఎత్తున భక్తులు, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



## రామాయంపేటలో.. అక్రమ ఇసుక నిల్వలు సీజ్

**ప్రజాపక్షం/రామాయంపేట:** పట్టణంలోని టీచర్స్ కాలనీ పరిసరాల్లో అనుమతులు లేకుండా అక్రమంగా డంప్ చేసిన ఇసుక నిల్వలను రెవెన్యూ, పోలీస్ అధికారులు సంయుక్తంగా దాడులు చేసి ఇసుక నిల్వలను సీజ్ చేశారు. గురువారం రాత్రి నుండి శుక్రవారం ఉదయం వరకు దాడులు కొనసాగాయి. ఇసుక నిల్వలతో పాటు రెండు ట్రాక్టర్లు, ఒక జేసిబిని కూడా అధికారులు సీజ్ చేశారు. ఈసందర్భంగా తహశీల్దార్ రజనికుమారి, ఎస్ఐ బాల్‌రాజు మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేసిన, నిల్వ చేసిన చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



